క్లుప్తంగా

29న శ్రీహరికోటకు ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: శ్రీహరికోటలో ప్రయోగించే రాకెట్ కేంద్రాన్ని సందర్శించడానికి 29న ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. కాలేజీ, పాఠశాల విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూన్ 3 పౌర్ణమికి అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7382875034, 9440858510ను సంప్రదించాలన్నారు.

29న మండల మీట్

తంబళ్లపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 29వ తేదీన ఉదయం ఉదయం 10గంటలకు ఎంపీపీ అనసూయమ్మ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు, కోఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, డివిజన్, మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

సమ్మర్ క్యాంపులకు ఆదరణ

మదనపల్లె సిటీ: వేసవి శిక్షణ శిబిరాలకు ఆదరణ లభిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి షేక్ షఫీ తెలిపారు. జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రాజంపేటతో పాటు పలు ప్రాంతాల్లో క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక కోచ్‌లతో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈనెలఖరుకు శిక్షణ శిబిరాలు ముగుస్తాయన్నారు.

ముగిసిన మారెమ్మ జాతర

రామసముద్రం: మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లెలో వెలసిన గ్రామదేవత మారెమ్మ జాతర బుధవారం వైభవంగా ముగిసింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, మొక్కులు సమర్పించారు. గ్రామం బంధుమిత్రులతో కిటకిటలాడింది. మంగళవారం రాత్రి అమ్మవారి ప్రతిమను గ్రామంలో ఘనంగా ఊరేగించారు. ఇంటింటా మహిళలు కర్పూర హారతులు అందజేశారు.

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిద్దాం

మదనపల్లె : మండలంలోని చిన్న, సన్నకారు రైతులు పండ్లతోటల పెంపకం చేపట్టేలా ఉపాధి హామీ సిబ్బంది ప్రోత్సహించాలని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ అన్నారు. బుధవారం స్థానిక మండల మహిళా సమాఖ్య(వెలుగు) కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, ఫీల్డ్,టెక్నికల్ అసిస్టెంట్‌లు, మహిళాసమాఖ్య ఆర్పీలు, సీసీలు, హార్టికల్చర్ అధికారులతో పండ్లతోటల పెంపకంపై సమావేశం నిర్వహించారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ట


కలశాలతో మహిళలు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ పెద్దలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లిలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. సుమారు 3,500 కుటుంబాలకు పైగా మొరుసు కాపుల ఇలవేల్పుగా భావించే ఈ ఆలయానికి మండల వాసులే గాక కర్నాటక రాష్ట్రం నుంచి వేల సంఖ్యలో మొరుసు కాపులు తరలి వచ్చి భక్తి, శ్రద్దలతో పూజలు నిర్వహించారు. పురాతన కాలం నాటి ఈ ఆలయాన్ని సుమారు రూ.3 కోట్లతో పునః నిర్మాణం చేపట్టగా పూర్తి స్థాయిలో పనులు జరిగేందుకు కాపులు ఆలయ కమిటీకి తమ వంతు విరాళాలు అందజేశారు. ఈ నేపథ్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా మంత్రోచ్చారణల నడుమ ఆలయంలో చండీయాగం, గణపతి పూజ, పుణ్యాహవాచకం, మహా సంకల్పం, అష్టమూర్తి ప్రార్థన, కలశ స్థాపన, ప్రధాన దేవతా ప్రతిష్ట, బ్రహ్మ కమలా పూజ, హోమాలు, మహా పూర్ణాహుతి, మహా మంగళ హారతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు.

అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు

చౌడేశ్వరీ అమ్మవారి ఆలయం ఆవరణలో కమ్యూనిటి భవనం నిర్మాణం కోసం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిలు రూ.70 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే ఆలయానికి విచ్చేసి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ధర్మకర్త రామాంజనేయరెడ్డి ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించారు. వేద పండితులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, కన్వీనర్ సుబ్బరాం, కోఆప్షన్ ఖాదర్‌వలితో పాటు స్థానిక నాయకులు సీపీ సుబ్బారెడ్డి, పీఎస్ మధు, ఆర్‌పీ క్రిష్టారెడ్డి, రవిచంద్రారెడ్డి, చౌడిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, నవీన్, ఆంజినేయరెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో లోకాయుక్త జస్టిస్


లోకాయుక్త కుటుంబ సభ్యులకు సన్మానం

రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ రెడ్డి దంపతులు బుధవారం మండలంలోని టి.సదుం పంచాయతీలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ దేవీ అమ్మవారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు, ఆలయ కమిటి నిర్వాహకులు లోకాయుక్త కుటుంబ సభ్యులను సాదరంగా ఆహ్వానించి అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించినట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే జాండ్ల పంచాయతీ ఆవులయ్యగారిపల్లె, సూర్యానాయక్ తండా, మూరేవాండ్లపల్లెలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి గడిచిన నాలుగేళ్లలో లబ్ధి పొందిన వివరాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరిగింది శూన్యమని పేర్కొన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడంతోపాటు కొంత పథకాలు తీసుకొచ్చారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త ఆలోచనలో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్నారని తెలిపారు. అర్హత గల అన్ని వర్గాలకు పథకాలు అందిస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అప్పటికప్పుడే సంబంధిత కారులకు తెలిపి పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడానికి తమవంతు సహకారం ఉంటుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్ రెడ్డి, ఏపీడీ నందకుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు నీలిమ, హబీబ్‌బాషా, ఎంపీటీసీ కృష్ణమ్మ, నాయకులు దినకర్ రెడ్డి, కుసుమశేఖర్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, సురేంద్రనాయుడు, ఆనంద్, ఉదయ్, కాలనీ చిన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట

కలికిరి: మండల పరిధిలోని కలికిరి గ్రామ పంచాయతీ చెరువుముందరపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామాలయంలో బుధవారం మూల విగ్రహాల ప్రాణప్రతిష్టకావించారు. ఈ సందర్భంగా మూడు రోజులుగా ఆలయ ఆవరణలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణలో ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రాతఃపూజ, ప్రతిష్ఠాహోమం, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, అష్టబలి, నవగ్రహ హోమం , మూల విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు.

నూతన పరిశోధనలపై దృష్టి సారించాలి

కురబలకోట: రక్షణ రంగంలో దేశానికి ఉపయోగపడే పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలని బెంగళూరు ఎఫ్‌సీఎంటీఐ శాస్త్రవేత్త డాక్టర్ షణ్ముగరాజు సూచించారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ట్రెండ్స్ అండ్ ఆపర్చునిటీస్ ఇన్ డిఫెన్స్ సెక్టార్‌పై ఐదు రోజుల పాటు జాతీయ స్థాయిలో జరిగే సమ్మిట్ బుధవారం నుంచి ప్రారంభమైంది. దేశ నలుమూలల నుంచి పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులు, డిఫెన్స్ రంగ మేధావులు పాల్గొన్న సమ్మిట్‌లో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. దేశ రక్షణ రంగం పటిష్టంగా ఉందన్నారు. చెన్నై డీఆర్‌డీఓ డిఫెన్స్ శాస్త్రవేత్త డాక్టర్ కె. రవిచంద్రన్ మాట్లాడుతూ డిఫెన్స్ రంగంలో 70 వేల కోట్లు విలువ చేసే 390 ప్రాజెక్టులు డీఆర్‌డీఓలో ఉన్నాయన్నారు. ఇతర దేశాలకు డిఫెన్స్ ఆయుధాలను మనమే సరఫరా చేయవచ్చన్నారు. నానో మెటిరియల్స్, కంపోజిట్ మెటీరియల్స్, త్రీడీ ప్రింటింగ్ రంగాల్లో పరిశోధనలు గావించడానికి మంచి అవకాశాలు ఉన్నాయని సీఎంటీఐ శాస్త్రవేత్త ఎ. వినోద్ అన్నారు. డిఫెన్స్ రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు విరివిగా ఉన్నాయన్నారు.

వలంటీర్లకు సన్మానం

ములకలచెరువు: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ములకలచెరువు, పెద్దపాళ్యం సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ వలంటీర్లకు సేవామిత్ర, సేవావజ్ర, సేవారత్న పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీల, సర్పంచ్‌లు శోభారాణి, రహమత్‌బీ, ఎంపీటీసీ చాంద్‌బాషా, నాయకులు రవీంద్రారెడ్డి, ఉమా మహేష్, రెడ్డి మౌలాలి, బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె మార్కెట్‌కు 1,021 టన్నుల టమాటా

మదనపల్లె : దేశంలో టమాటా క్రయవిక్రయాలకు పేరుమోసిన మదనపల్లె మార్కెట్‌కు ఈ ఏడాది సీజన్ ప్రారంభమయ్యాక తొలిసారిగా 1,021 మెట్రిక్‌టన్నుల టమాటాను రైతులు విక్రయాలకు తీసుకువచ్చారు. సరిగ్గా నెలకింద ఏప్రిల్ 24వ తేదీన మార్కెట్‌కు 298 మెట్రిక్‌టన్నుల టమాటా వస్తే...30 రోజుల వ్యవధిలో దాదాపు మూడింతల దిగుబడులు అధికమవడం విశేషం. మే 4వ తేదీ వరకు 500 మెట్రిక్‌టన్నులలోపు వస్తున్న టమాటా దిగుబడులు గత పదిహేనురోజులుగా క్రమేపీ పెరుగుతూ బుధవారానికి 1,021 మెట్రిక్‌టన్నులకు చేరుకుంది. బుధవారం మార్కెట్‌లో మొదటిరకం టమాటా కిలో రూ.10-13.20 వరకు.. రెండోరకం కిలో రూ.6.60 నుంచి 9.80 వరకు ధర పలికింది. మదనపల్లె టమాటా మార్కెట్ చరిత్రలో 2020 మే 20న మదనపల్లె మార్కెట్‌కు 1,500 మెట్రిక్‌టన్నులు దిగుబడులు నమోదైతే...2021 జూన్ 13న 1,610 మెట్రిక్ టన్నుల దిగుబడులు ఆల్‌టైమ్ రికార్డ్‌గా నిలిచిపోయాయి. దిగుబడులు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ అధికారులు అంచనా వేస్తున్నారు.





మంచి నాయకుడిని కోల్పోయాం

పెద్దతిప్పసముద్రం: ప్రజల హృదయాల్లో గూడు కట్టుకున్న మంచి నాయకుడిని కోల్పోయామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మండలంలోని రంగసముద్రం గ్రామ ఏకగ్రీవ సర్పంచ్ కొండా జగదీశ్వర్ అలియాస్ బాబురెడ్డి (54) మంగళవారం ప్రమాదవశాత్తు ఇంటి వద్ద విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే రంగసముద్రం పంచాయతీలోని కుర్రావాండ్లపల్లికి వెళ్ళి బాబురెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కొండా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్నతో పాటు బీవీ సుబ్బరాం,బుచ్చిగారి సుబ్బిరెడ్డి, రియాసత్ అలీఖాన్, భాస్కర్ నాయుడు, ఉప సర్పంచ్ శివ, సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

విద్యాకానుక కిట్లలో తేడాలొస్తే చర్యలు

వాల్మీకిపురం: విద్యార్థులకు పంపిణీ చేయనున్న జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ విషయంలో తేడాలొస్తే చర్యలు తప్పవని కమ్యూనిటీ మొబలైజర్ అధికారి కరుణాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జేవీకే స్టాక్ పాయింట్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్ రిజిస్టర్లను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రాబోవు విద్యా సంవత్సరంలో ప్రతి పిల్లాడికి జేవీకే కిట్లు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని జెట్టిపాల్యెంవీధిలోని ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల సమస్యపై తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్‌తో కలసి పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటరత్నం, హెచ్‌ఎం పద్మావతి, పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే సురక్షిత ప్రసవం

కలకడ : ప్రభుత్వ ఆసుపత్రిలోనే సురక్షిత ప్రసవం సాధ్యమని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని దేవులపల్లె సచివాలయం పరిధిలోని బొజ్జగుంటపల్లె లో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. 10 గ్రాముల లోపు రక్తం ఉన్న ముగ్గురు గర్భిణులను పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేయడానికి రెఫర్ చేశారు. 60 సంవత్సరాలు దాటిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. సాధారణ జబ్బులు ఉన్న 20మందికి, 9 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 18 సంవత్సరాల వరకూ ప్రభుత్వం ఉచితంగా అందించే వ్యాధినిరోధక టీకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.







